క్లుప్తంగా

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని నవదుర్గ ఆలయంలో నేటి(ఆదివారం) నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సూదనబోయిన ఓంప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగాది మహా పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు లలిత త్రిపురసుందరి అవతారంలో కనిపించనున్నట్లు తెలిపారు. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి కుంకుమార్చన, లలిత సహస్రనామా పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. నవరాత్రుల్లో చివరి రోజు హోమం, మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు

బ్రాండెడ్ మద్యం అమ్మడం లేదని ఫిర్యాదు

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మద్యం దుకాణాల్లో బ్రాండెడ్ మద్యం అమ్మడం లేదని మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. వైన్స్‌షాప్ నిర్వాహకులు బ్రాండెండ్ మద్యం బెల్టుషాపులకు తరలిస్తున్నారని ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

నియామకం

చిట్యాల: కేటీఆర్ సేన మండల అధ్యక్షుడిగా మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన మురహరి తిరుపతిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు పిన్నింటి మణిదీప్ రావు తెలిపారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్, నాయకులు పెరుమాండ్ల రవీందర్‌గౌడ్, ఆరెపల్లి సమ్మయ్య, దూదిపాల తిరుపతిరెడ్డి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఓబీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ ఓరంగంటి శేఖర్, మాజీ సర్పంచ్ సధాకర్ తల్లి భూలోకమ్మ శనివారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సంగి రవి పరామర్శించారు. వారి వెంట బండపల్లి మాజీ సర్పంచ్ నామని రాజేందర్, దొంతుల శ్రీనివాస్, కోరె చందు, మాడుగుల ప్రకాశ్, తదితరులు ఉన్నారు.


నిందితులను శిక్షించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: ఏపీలోని రాజబమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై వెంటనే విచారణ చేపట్టి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు సంపత్‌పాల్ డిమాండ్ చేశారు. శనివారం ప్రవీణ్ పగడాల మృతిపై క్రైస్తవులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యదర్శి తిమోతి రాజు, ట్రెజరర్ కిషోర్, చీఫ్ అడ్వైయిజర్లు సత్యానందం, ప్రవీణ్, కుమార్ పాల్గొన్నారు.

నేడు కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం

కాటారం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూంను నేడు (ఆదివారం) రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. నేర నియంత్రణలో భాగంగా కాటారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన కూడలితో పాటు అన్ని కాలనీల్లో అమర్చిన అత్యాధునిక కెమెరాలను పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ఎల్ఈడీ స్క్రీన్‌లో మానటరింగ్ చేసేలా సిద్ధం చేశారు. జిల్లా కేంద్రానికి సాటిగా కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూం కొనసాగనుంది. భారీ స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం కోసం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ ఎంతగానో కృషి చేశారు.

సన్మానం



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం కొత్తపల్లి (ఎస్ఎం) గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగులను పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. శనివారం కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పూర్వ విద్యర్థుల సంఘంతో పాటు పులి లక్ష్మి, సమ్మయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి శ్రీనివాస్, సారంగపని, లాడే రమేశ్ హాజరై ఉద్యోగులకి షిల్డ్ శాలువతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘు, మాజీ ఎంపీటీసీ నర్సింగం, మాజీ జడ్పీటీసీ రాజవీరు గ్రామస్తులు కిరణ్, తిరుపతి, యుగేందర్, బాపూరావు, రాజయ్య, రాధ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి వైపు మొగ్గు

ఆదర్శంగా నిలుస్తున్న యువత

- ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి కల్పిస్తున్న వైనం

Sunday Special

టేకుమట్ల: ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా మారి ఉపాధి కోసం పట్టణాల వెంట పరుగులు తీస్తున్న వారు ఎందరో ఉన్నారు. కానీ కొంత మంది యువకులు ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారు. అలాంటి వారు పలువురికి ఆదర్శంగా నిలుస్తూ ఉపాధిపై నమ్మకాన్ని పెంచుతున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డ వారికంటే ఉపాధి రంగాలను ఎంచుకుని రాణిస్తున్న యువతనే ఎక్కువగా ఉన్నారు.

ఎంఎస్సీ, బీఈడీ పూర్తి..



మండల కేంద్రానికి చెందిన మాట్ల శ్రీనివాస్ అనే యువకుడు ఎంఎస్సీ బీ ఈడీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. అలాగే 2020లో పీహెచ్‌డీకి ఎంపికైన పలు కారణాలతో సీటు రాలేదు. దీంతో ఉపాధి రంగం వైపు అడుగులు వేశాడు. మిత్రుడి సహాయంతో బేకరీ ఫుడ్ తయారీ నేర్చుకుని సొంతగా 2023లో బేకరీని ఏర్పాటు చేశాడు. అంతే కాకుండా బేకరీ నిర్వహణలో మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తూ నెలకు రూ.30వేలకు పైగా సంపాదిస్తూ ఎంతో మంది యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఉద్యోగం కోసం ఎదురు చూస్తే ఆర్థికంగా వెనకబడి కుటుంబ పోషణ భారంగా మారేదని శ్రీనివాస్ తెలుపుతున్నాడు. ఉద్యోగం లేకున్నా ఉపాధిపైనే దృష్టి సారించి ఆర్థికంగా ఎదిగేందుకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని ప్రస్తుతం సంతోషంగా ఉన్నట్లు వెల్లడించారు.

బీ ఫార్మసీ చేసి, సూపర్ మార్కెట్ నెలకొల్పి..



మండలంలోని వెంకట్రావుపల్లి(బి) గ్రామానికి చెందిన సముద్రాల అనిల్ బీ ఫార్మసీ పూర్తి చేసి ఉద్యోగంపై ఆశ వదలి ఉపాధి రంగం వైపు అడుగులు వేశాడు. వివాహ అనంతరం హైదరాబాద్ వంటి నగరంలో ఉద్యోగం సాధ్యం కాదని, మండల కేంద్రంలో సూపర్ మార్కెట్‌ను 2023లో ఏర్పాటు చేసుకుని ఉపాధిని పొందుతున్నాడు. అతను ఉపాధి పొందుతూ మరొకరికి ఉపాధిని కల్పిస్తున్నాడు.

కిరాణం నడుపుకుంటూ..



మండల కేంద్రానికి చెందిన రావికంటి పూర్ణచందర్ బీఎస్సీ, బీ ఈడీ పూర్తి చేసి కొంత కాలం పాటు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేశాడు. డీఎస్సీలో ఉద్యోగం రాకపోవడంతో మండల కేంద్రంలో కిరాణాన్ని నడుపుకుంటున్నాడు. ఉద్యోగం రాకపోయినా వ్యాపారంలో ఉన్నతంగా సంపాదిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచాడు.

బీఏ చదివి టీ పాయింట్..



ఆర్థిక వనరులు లేక కుటుంబాన్ని పోషించుకునేందుకు మండల కేంద్రానికి చెందిన ఎరివెల్లి మహేశ్ అనే యువకుడు బీఏ పూర్తి చేసి, ఆర్థిక భారాన్ని అధిగమించేందుకు మండల కేంద్రంలో గత ఏడాది టీ పాయింట్‌ను ఏర్పాటు చేసుకుని ఉపాధిని పొందుతున్నాడు. టీ కొట్టుతో నెలకు రూ.30వేలకు పైగా సంపాదిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. తమది రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబమని బీఏ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న సమయంలో తన సోదరుడు శ్రీనివాస్ తోడ్పాటుతో గత సంవత్సరం టీ పాయింట్ ఏర్పాటు చేసినట్లు మహేశ్ తెలిపాడు.

నీకిదే స్వాగతం..



స్వాగతం.. సుస్వాగతం
నూతన వత్సరమా
స్వాగతం
షడ్రుచులను
పంచ వచ్చిన
విశ్వావసు నవ వసంతమా
స్వాగతం.. సుస్వాగతం
తీగదారు పూలతో
కొత్త చిగురుటాకులతో
ఆకుపచ్చ చీరగట్టి
అడవమ్మను అందంగా అలంకరించి
విరబూసిన ఆమనివై వచ్చిన
నీకిదే స్వాగతం.. సుస్వాగతం!

– కొసరి శ్రీనివాస్, భూపాలపల్లి

కోయిల రాగాలు..



ఉగాది పండుగ
తెలుగువారు నిండుగా
జరుకునే వేడుక మన
ఉగాది పండుగ
పక్షుల కిలకిలలు కోయిల రాగాలు
పచ్చని ఆకులపై ఆటలాడుతున్నాయి
షడ్రుచుల సమ్మేళన చరిత గల్ల వేడుక
తీపి పులుపు ఉప్పు కారం చేదు వగరు
కష్ట సుఖలను పాలు పంచుకోమంటది
ఇంటింటి గుమ్మాలకు మామిడి ఆకులు
అలంకరిస్తారు మన అన్నదమ్ములంత

– మ్యాదరి సునీల్, జూకల్, జయశంకర్ భూపాలపల్లి

పాఠశాలల్లో ఉగాది వేడుకలు



కాళేశ్వరం: ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు



టేకుమట్ల: ఉగాది వేడుకల్లో విద్యార్థులు

మల్హర్: మండలంలో పెద్దతూండ్లలోని బ్రిలయట్ గ్రామర్, వల్లెకుంటలోని దేవీ విద్యోదయ పాఠశాలలో శనివారం ముందుస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉగాది పచ్చడితో పాటు బూరెలు, ఫ్రూట్ సలాడ్, సెమియా, పులిహోర వంటకలు చేశారు. తెలుగు సంద్రాయం ఉట్టిపడేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి.

టేకుమట్ల: మండలంలోని వెలిశాల నవచైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను ప్రిన్సిపాల్ రాం మధు, కరస్పాండెంట్ కారుకూరి నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వరూపేశ్, కృతన్, సద్విన్, వరుణ్‌తేజ్, అరవింద్ పంచె కట్టులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరీ, సుమలత, ప్రియాంక, గీతారాణి, నితీషా, చైతన్య, మౌనిక, రామ్మూర్తి, స్వరూప, అనూషలు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంఈఓ బాల్నే ప్రకాశ్‌బాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. ఉగాది పచ్చడి ప్రత్యేకతను వివరించారు. అనంతరం స్థానిక ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శశాంక్, ఉపాధ్యాయులు మడక మధు, సుధారాణి, సరితా దేవి, వలిపాషా, శ్రీనివాస్, వసుదప్రియ,వీరేశం,సమ్మయ్య, లీలారాణి, రజిత, షాహెదా బేగం,ప్రసూన, పూర్ణిమ, దీపిక, ఆంజనేయులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి

- చైర్మన్ శాంతకుమార్

కాటారం: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్ అన్నారు. మహాముత్తారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం శనివారం కార్యాలయంలో నిర్వహించారు. సంఘానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీ తదితర వివరాలను సీఈఓ శ్రీధర్ సమావేశంలో చదివి వినిపించారు. పలు అంశాలపై పాలకవర్గం, రైతులు చర్చించారు. బోర్లగూడెంలో పీఏసీఎస్ బ్రాంచ్ ఏర్పాటు, గ్యాస్ గోదాం, ఫర్టిలైజర్ దుకాణం ఏర్పాటుపై సమావేశంలో తీర్మానం చేశారు. సంఘంలో రుణం పొందిన వారు తిరిగి రుణాలు సకాలంలో చెల్లించాలని చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, డైరెక్టర్లు లింగమల్ల చిన్నరాజయ్య, కంపె రాజయ్య, తూటి భాస్కర్‌రెడ్డి, మల్లక్క, సుజాత, రైతులు, పీఏసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ శాంతకుమార్

అవయవదానం

రేగొండ: భౌతికంగా తమ కుమారుడు మృతిచెందినా అవయవదానంతో మరొకరిలో జీవించే ఉంటాడని భావించిన ఆ తల్లిదండ్రులు పుట్టెడు దుఃఖంలోనూ అవయవదానానికి అంగీకరించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన పోలవేన సంగీత్ (25) ఉరి వేసుకుని శుక్రవారం మృతి చెందాడు. సదాశయ ఫౌండేషన్ పరకాల కన్వీనర్ గుంటోజు వెంకట నారాయణ నేత్రదానంపై మృతుడి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. వారు అంగీకారం తెలుపడంతో ఎల్‌వీప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో కార్నియాలు సేకరించి ఐబ్యాంక్ తరలించారు. అవయావ దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

- ఎంపీడీఓ శ్యాంసుందర్

మల్హర్: నీటిని సంరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి (పీఓ) శ్రీకాంత్ అన్నారు. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన వాటర్ షెడ్ యాత్రలో భాగంగా మండలంలోని అడ్వాలపల్లి, పెద్దతుండ్ల గ్రామాల్లో శనివారం అవగాహన యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే తరాల వారికి సురక్షిత మంచినీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మొక్కలు నాటి, ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి నీటిని ఇంకించే పద్ధతిని అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామాల్లో శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో వాటర్ షెడ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, ఏపీఓ హరీశ్, ఏపీఎం కమల, కార్యదర్శులు, సీసీలు, ఉపాధిహామీ టీఏలు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ శ్యాంసుందర్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని రామగుండాలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ లోకిలాల్, ఎంపీఓ రాంప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు నాయినేని సంపత్‌రావు, జిల్లా, మండల నాయకులు సూదనబోయిన ఓంప్రకాష్, మొట్టే కిరణ్, పద్మకొమురరెడ్డి, సురేందర్ రెడ్డి, అమ్ముల రాజయ్య పాల్గొన్నారు.



రేగొండ: పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా, శిశు వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ట్రెడ్‌కార్పొరేషన్‌చైర్మెన్ ఐత ప్రకాశ్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులను, అంగన్‌వాడీ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమ అధికారి మల్లీశ్వరి, బీసీ, ఎస్సీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల జిల్లా అధికారులు శైలజ, సునీత, కుసుమకుమారి, ఆర్డీఓ రవి, మహదేవపూర్ సీడీపీఓ రాధిక, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం

భూపాలపల్లి పట్టణంలో పలు చోట్ల 160 కేవీఏ సామర్థ్యంతో జంగేడు రోడ్డు హనుమాన్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మరను శనివారం ఎమ్మెల్యే సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరం ఉన్న చోట రూ.1.28 కోట్లతో 22 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ మల్సూర్ నాయక్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కామన్ సర్వీస్ సెంటర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం గణపురం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మాలోతు వాల్యానాయక్ , పీఏసీఎస్ చైర్మన్ కన్నెబోయిన కుమార్, పాలకవర్గ సభ్యులు తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.



చిట్యాల: ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గండ్ర

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చిట్యాల: మారుమూల గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్‌లో రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే మండల కేంద్రంలోని మజీదులో ముస్లిలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ జిల్లా అధికారి శైలజ, తహసీల్దార్ హేమ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, నాయకులు దబ్బెట రమేశ్, మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ ఓరం సమ్మయ్య, పులి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మజీదులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ముస్లింలు సన్మానం చేశారు.

రేషన్ డీలర్లను ఆదుకోవాలి

టేకుమట్ల: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఆదుకోవాలని శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాల్‌కి రూ.300బోనస్‌తో పాటు, రూ.5000 వేతనాన్ని అందించాలన్నారు. గోదాం నుంచి రేషన్ షాప్‌కు వచ్చే బియ్యంలో ఎలాంటి తరుగు లేకుండా పంపిణీ చేయాలన్నారు. అరకొర కమీషన్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు తోట పద్మ, ఆనందపు లావణ్య, సుంకర ప్రసన్నరాణి, నన్నపు శంకరమ్మ, నాగుల స్వరూప, వంగ సరిత, కాసర్ల సరళ, గురిజాల సుజాత, రవి, జంగెపెల్లి శారద, ఆకునూరి ఓదెలు, శేశాద్రి, తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జమా మసీదులో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాళేశ్వరం మాజీ సర్పంచ్ వెన్నపురెడ్డి వసంతమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు శనివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ నిసార్, మౌజన్ శఫీక్, మత పెద్దలు సమద్, జానీ, ఇస్మాయిల్, మహబూబ్, ఎగ్బాల్, మగ్బూల్, బాబా, నాయకులు రాజిరెడ్డి, ఓగేష్, సురేష్ తదితరులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేకుమట్ల: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ విజయలక్ష్మి, ఏఎస్సై దాట్ల కుమారస్వామి అన్నారు. శనివారం మండలంలోని గర్మిళ్లపల్లిలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ సాయికుమార్, జూనియర్ అసిస్టెంట్ పృద్విరాజ్, గ్రామస్తులు ఉన్నారు.

స్విమ్మింగ్ పూల్ తనిఖీ

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కృష్ణాకాలనీ స్విమ్మింగ్‌పూల్‌ను ఏరియా ఇన్‌చార్జ్ సింగరేణి జనరల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి శనివారం తనిఖీచేశారు. వేసవి కాలంలో పిల్లలు స్విమింగ్‌కు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుందని వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి మారుతి, అధికారులు శ్రావణ్, శ్రీనివాస్, కోచ్‌లు తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.